క్లుప్తంగా

సిగ్నల్ కష్టాలు..!



పింఛన్లు అందజేస్తున్న బీపీఎం

కుంటాల: మండలంలోని దౌనెల్లిలో సెల్ టవర్ లేక గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామంలో పింఛన్లు పంపిణీ చేసేందుకు వచ్చిన బీపీఎం నాగభూషణం శనివారం గుట్ట ప్రాంతానికి వెళ్లి డబ్బులను అందజేశారు. సెల్‌టవర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎస్సై అశోక్

లోకేశ్వరం: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అశోక్ తెలిపారు. మండలంలోని పంచగుడి గోదావరి వంతెన వద్ద శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనాదారులు తమ వాహనపత్రాలు తమవెంట తెచ్చుకోవాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్లపై వరి ధాన్యం ఆరబెట్టవద్దన్నారు. ఆయన వెంట పోలీసులు ఉన్నారు.

కొండ చిలువ పట్టివేత



కొండ చిలువతో రిటైర్డ్ టీచర్ రాంరెడ్డి

కడెం: మండలంలోని చిట్యాల్ గ్రామంలోని జనావాసాల్లో శనివారం కొండచిలువ కనిపించడంతో గ్రామస్తులు భయందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు నల్ల రాంరెడ్డి.. కొండచిలువను పట్టుకుని సమీప ఆటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

స్వర్ణ ప్రాజెక్టు సందర్శన

సారంగపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో వరద ప్రభావిత ప్రాంతాలను శనివారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పరిశీలించి రైతులను పరామర్శించారు. వంజర్, కంకెట, తాండ్ర(జి), మలక్‌చించోలి, సారంగాపూర్ గ్రామాలను సందర్శించిన అనంతరం స్వర్ణ ప్రాజెక్టు వద్దకు వెళ్లి ప్రాజెక్టు పరిస్థితిని గురించి అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఏఈ వేణుగోపాల్, మధుపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ, డైరెక్టర్లు, నాయకులు ఉన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నిర్మల్‌టౌన్: గణేశ్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. పట్టణంలో నిమజ్జనం జరిగే చోట శానిటేషన్ సిబ్బందితో శనివారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటుచేశారు. పిచ్చి మొక్కలను తొలగించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఓటరు జాబితాకు సహకరించాలి

కుంటాల/నర్సాపూర్(జి)/కడెం/లోకేశ్వరం/ఖానాపూర్/కుభీర్/లక్ష్మణచాంద/దస్తురాబాద్: లోపాలు లేని ఓటరు జాబితాకు అన్ని పార్టీ రాజకీయ నాయకులు సహకరించాలని ఎంపీవోలు రహీంఖాన్, తిరుపతిరెడ్డి, కవిరాజు, అమీర్‌ఖాన్, మోహన్‌సింగ్, రమేశ్‌రెడ్డి, ఎంపీడీవోలు పుష్పలత, సోలమాన్‌రాజ్, రాధ, సునీత, రత్నాకర్‌రావు, సాగర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి జీవరత్నం, తహసీల్దార్ శివరాజ్ పేర్కొన్నారు. కుంటాల, నర్సాపూర్(జి), కడెం, లోకేశ్వరం, ఖానాపూర్, కుభీర్, లక్ష్మణచాంద, దస్తురాబాద్‌లో ఓటరు జాబితాపై శనివారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అన్ని పంచాయతీ కార్యాలయాల్లో ఓటరు ముసాయిదా జాబితాను ప్రదర్శించామని, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన రైతుల ఆశలు!

- గోదావరి, గడ్డెన్న, సుద్దవాగు ఉధృతికి దెబ్బతిన్న పంటలు
- భైంసా, లోకేశ్వరం, కుంటాల, కడెం మండలాల్లో భారీ నష్టం



పోట్‌పల్లి(ఎం)లో సుద్దవాగు ఉధృతికి దెబ్బతిన్న పత్తి

లోకేశ్వరం/భైంసారూరల్/కుంటాల/కడెం: మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు జిల్లాలోని రైతుల ఆశలను నీటి ముంచాయి. లక్ష్మణచాంద, భైంసా, లోకేశ్వరం, కుంటాల, కడెం మండలాల్లో పంటలు పూర్తిగా నీటమునిగాయి. గోదావరి, గడ్డెన్నవాగు, సుద్దవాగు, సిరాల ప్రాజెక్టుల వరదలు పంటలకు తీవ్ర నష్టం మిగిల్చాయి. వరి, పత్తి, సోయాబిన్, ఇతర పంటలు నీటిలో కొట్టుకుపోయాయి. రైతులు ఆర్థికంగా దెబ్బతిన్నారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో వరద నీరు భైంసా మండలంలోని మూడు గ్రామాల్లో వరి, పత్తి, సోయాబీన్ పంటలు కొట్టుకుపోయాయి. సిరాల ప్రాజెక్టు అలుగు నీటి కారణంగా ఇలేగాం గ్రామానికి చెందిన రైతుల పంటలు దెబ్బతిన్నాయి. ఇక కుంటాల మండలం సూర్యాపూర్ నుంచి కల్లూరు వరకు వాగు పరివాహక ప్రాంతంలో వరి, పత్తి, సోయాబిన్ పంటలు నీటిలో మునిగాయి. దౌనెల్లి గ్రామానికి చెందిన కొండూర్ గజేందర్ ఆయిల్‌పామ్‌తోపాటు సోయా, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. అదే గ్రామానికి చెందిన ఎస్‌కే.అజామ్‌కు రెండు ఎకరాల్లో సాగు చేసిన పత్తి, తొగరి పంటలు వరదకు గురయ్యాయి. మరో రైతు కన్నె ముత్యం నాలుగు ఎకరాల్లో సాగుచేసిన పత్తి పంటతోపాటు సోలార్ కంచె కొట్టుకుపోయింది. లోకేశ్వరం మండలంలో సుద్దవాగు వరదల కారణంగా 332 ఎకరాల్లో సాగు చేసిన పంటలు నష్టపోయాయి. పుస్పూర్, పోట్‌పల్లి, హథ్‌గాం, సాథ్‌గాం, బిలోలి, హవర్గ, మన్మద్ గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. గోదావరి ఉధృతికి కడెం మండలంలోని లింగాపూర్, చిన్నబెల్లాల్, సారంగపూర్, చిట్యాల్ గ్రామాల్లో పసుపు, మొక్కజొన్న, పత్తి పంటలు నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయి. మూడు రోజులుగా వరద కొనసాగుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

నష్టపరిహారం కోసం నిరీక్షణ..

నాలుగేళ్లుగా జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలు ముధోల్, నిర్మల్ నియోజకవర్గాల్లో సుద్దవాగు, సిరాల, స్వర్ణ, కడెం ప్రాజెక్టుల ఆయకట్టు, పరీవాహక ప్రాంతాల్లో పంటలను నాశనం చేస్తున్నాయి. 2021 నుంచి 2025 వరకు ఈ సమస్య కొనసాగుతోంది. రైతులు ఎకరానికి రూ.15 వేలు పెట్టుబడి, ఇసుక మేటల తొలగింపునకు రూ.10 వేలు ఖర్చు చేస్తున్నారు. అయినప్పటికీ, ప్రభుత్వం నుంచి తగిన పరిహారం అందడం లేదు. ప్రభుత్వం తక్షణం స్పందించి, నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.

నష్ట పరిహారం అందించాలి



సుద్దవాగు ఉధృతికి ఏటా పంటలను నష్టపోతున్నాం. పోట్‌పల్లి సుద్దవాగు ప్రాంతంలో ఆరు ఎకరాల్లో ఖరీఫ్‌లో పత్తి, సోయా, మిర్చి సాగు చేశాను. సుద్దవాగు ఉధృతికి కొట్టుకుపోయింది. ప్రభుత్వం పంట నష్ట సర్వే చేయించి నష్ట పరిహారం అందించాలి. – గంగాధర్, పోట్‌పల్లి (ఎం)రైతు

ఆదుకోవాలి



మూడు రోజులుగా వరద నీరు రెండెకరాల పంట మునిగింది. అధికారులు పంట నష్టంపై అంచనా వేయాలి. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలి. – గోళ్ల వెంకటేశ్, రైతు, నర్సింగాపూర్

కన్నీళ్లే మిగిలాయి



కురిసిన భారీ వర్షాలకు పంటలు కొట్టుకుపోయి, రాళ్లు, రప్పలే మిగిలాయి. పంటను చూస్తే కన్నీళ్లు వస్తున్నాయి. ప్రభుత్వం సర్వే నిర్వహించి పరిహారం అందించి ఆదుకోవాలి. – కొండూరి గజేందర్, దౌనెల్లి

భైంసా మండలం వాలేగాంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో..



నవయువ యూత్ ఆధ్వర్యంలో..



గణపయ్య..విభిన్న రూపాయ

భైంసారూరల్/కడెం/నర్సాపూర్(జి)/నిర్మల్‌టౌన్/కుంటాల/లోకేశ్వరం/ఖానాపూర్/తానూరు: జిల్లావ్యాప్తంగా గణపయ్యలు కొలువుదీరాయి. ఆయా మండపాల్లో ప్రతిష్ఠించిన లంబోదరునికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. విభిన్న రూపాల్లో ఉన్న వినాయక విగ్రహాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. నర్సాపూర్(జి) మండల కేంద్రానికి చెందిన వంశీ కృష్ణ ఎకో ఫ్రెండ్లీ పేపర్ గణపతి విగ్రహాన్ని తయారు చేశాడు. తానూరు మండలం భోసిలో నెలకొల్పిన వరసిద్ధి వినాయకునికి దర్శించుకునేందుకు శనివారం భక్తులు బారులు తీరారు. పలు మండపాల వద్ద కుంకుమపూజల తోపాటు అన్నదానాలు నిర్వహించారు.



ఖానాపూర్ సాయినగర్‌లో శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి రూపంలో..



కుంటాల: గొడుగు నీడన గణపతిని పాఠశాలకు పంపుతున్న పార్వతి దేవి

నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్

కుంటాల: గ్రామీణ ప్రాంతాల్లో నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని భైంసా రూరల్ సీఐ నైలు పేర్కొన్నారు. మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో శనివారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. తనిఖీలు చేపట్టి ధ్రువపత్రాలతోపాటు చలాన్లు కట్టని 67 బైక్‌లు, 5 ఆటోలు, 1 టాటా మ్యాక్స్, 1 టాటా ఏస్ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మీసేవ ద్వారా చలాన్లు చెల్లింపజేసి వాహనాలను యజమానులకు అప్పజెప్పారు. ఈ సందర్భంగా భైంసా రూరల్ సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అపరిచితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై అశోక్, ఏఎస్సైలు దేవన్న, జీవన్ రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెంబి: మండలంలోని నాగాపూర్‌లో పోలీసులు శనివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఖానాపూర్ సీఐ అజయ్ ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్సైలు, సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని 40 బైక్‌లు, నాలుగు ట్రాక్టర్లు, ఆటో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామస్తులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. పెంబి ఎస్సై హన్మాండ్లు, ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్, కడెం ఎస్సై సాయికిరణ్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.



నాగాపూర్‌లో స్వాధీనం చేసుకున్న వాహనాలు

మ్యాక్స్ సభ్యత్వం ఉంటేనే యూరియా

పెంబి: యూరియా కోసం రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. మండల కేంద్రంలోని గిరిజన రైతు ఉత్పత్తిదారుల సంస్థకు శనివారం యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న మండల రైతులు అక్కడికి తరలివచ్చారు. కాసేపు రైతుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎస్సై హన్మాండ్లు వారిని రెండు లైన్‌లో నిలబెట్టారు. గంటల తరబడి లైన్‌లో ఉన్న రైతులు కౌంటర్ వద్దకు వెళ్లారు. మ్యాక్స్‌లో సభ్యత్వం లేకపోతే యూరియా ఇవ్వడం కుదరదని నిర్వాహకులు తెలపడంతో నిరాశగా వెనుదిరిగారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థ రైతులందరికి ఉపయోగపడాలి కాని సభ్యులకే పరిమితం కావడం ఏంటని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు.



యూరియా కోసం తరలివచ్చిన రైతులు

పందుల బెడద నివారించాలని ధర్నా

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్‌లో ఏళ్లుగా స్వైర విహారం చేస్తున్న పందుల బెడద నివారించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తూ మండల కాంప్లెక్స్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. మండల కాంప్లెక్స్ ఆవరణలోని తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో, పీఏసీఎస్, ఎన్ఆర్‌ఈజీఎస్ కార్యాలయాల ప్రధాన గేటు ఎదుట ఉదయం 10 గంటలకు ధర్నా చేశారు. దాదాపు మూడు గంటల పాటు అక్కడే బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామంలో పందుల బెడదతో పలువురు అనారోగ్యం బారినపడుతున్నారని తెలిపారు. బ్రెయిన్ ట్యూమర్‌తో చిన్నారులు మృతి చెందారని పేర్కొన్నారు. పందుల బెడద అరికట్టాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. కాగా, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్, ఎంపీడీవో అరుణారాణి, ఎంపీవో గోవర్ధన్‌లు.. ధర్నా చేస్తున్న గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఇందుకు ససేమిరా అంటూ ప్రధాన గేటుకు తాళం వేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్.. జిల్లా కలెక్టరేట్ కార్యాలయ అధికారులతో మాట్లాడారు. త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు. పార్టీల నాయకులు డి.ముత్యంరెడ్డి, మాజీ ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, యువజన సంఘాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న దిలావర్‌పూర్ గ్రామస్తులు

ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి భోజనం

బాసర: బాసరలో కురిసిన భారీ వర్షాలకు గ్రామాలలో వరదలలో చిక్కుకున్న వారిని రక్షించడానికి వచ్చిన ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి వెంకటాపురం హరిత–కిషన్ రావు దంపతులు భోజన వసతి కల్పించి మానవత్వం చాటుకున్నారు. 70 మంది సిబ్బందికి ఒక్కపూట కోసం భోజనం అందజేశారు.

పంటలు పరిశీలించిన అధికారులు



భైంసా మండలం కామోల్‌లో పంటలను పరిశీలిస్తున్న ఏవో గణేశ్



లక్ష్మణచాంద: చింతల్‌చాంద వద్ద పంటలను పరిశీలిస్తున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



సోన్ మండల కేంద్రంలో పర్యటిస్తున్న మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



బాదన్‌కుర్తిలో నీటమునిగిన పంటలు

భైంసారూరల్/కుంటాల/ముధోల్/లోకేశ్వరం/లక్ష్మణచాంద/ఖానాపూర్/కడెం/సోన్/నిర్మల్‌రూరల్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. చేలలో వర్షపు నీరు నిలిచి నీటమునిగాయి. భైంసా మండలం కామోల్ గ్రామంలో ఏవో గణేశ్ శనివారం నష్టపోయిన పంటలను పరిశీలించారు. నష్టం వివరాలను సేకరించారు. ఎమ్మెల్యే రామారావు పటేల్, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిలు వేర్వేరుగా వెళ్లి క్షేత్రస్థాయిలో రైతులను కలిశారు. రెవెన్యూ, పోలీసు అధికారులు వెళ్లి జరిగిన నష్టాన్ని తెలుసుకుంటున్నారు. దేగాం– ఇలేగాం గ్రామాల మధ్య లోలెవల్ వంతెనపై నీరు తగ్గడంతో రాకపోకలు కొనసాగుతున్నాయి. భారీ వర్షంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భైంసా సబ్ కలెక్టర్ సంకేత్‌కుమార్ సూచించారు.

- ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల్లో వ్యవసాయ అధికారులు పంట నష్టం సర్వే చేస్తున్నారు. ఈనెల 29 వరకు చేపట్టిన సర్వేలో 1510 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లిందని గుర్తించారు. తాజాగా గోదావరి వరద ప్రవాహం పెరగడంతో అదనంగా మరో 700 ఎకరాల్లో నష్టం పెరిగినట్లు తెలిపారు. పలుచోట్ల ఇసుక మేటలు వేయడంతో 486 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని ప్రకటించారు. 4 మండలాల్లో మొత్తం 2696 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదించామని ఏడీఏ సుజాత తెలిపారు.
- కుంటాల మండలంలోని గ్రామాల్లో భారీ వర్షాలకు నష్టపోయిన పంటలు, కూలిన ఇళ్ల బాధితులను ఆదుకోవాలని శనివారం తహసీల్దార్ కమల్‌సింగ్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు.
- ముధోల్ మండలంలోని గ్రామాల్లో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని మాజీ జెడ్పీటీసీ లక్ష్మీనర్సాగౌడ్ కోరారు.
- లోకేశ్వరం మండలం పుస్పూర్ గ్రామంలోని భైంసా గడ్డెవాగు ప్రాజెక్టు ఉధృతికి నష్టపోయిన పంటను పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, ఆత్మ చైర్మన్ గన్ను నర్సారెడ్డి, కాంగ్రెస్ మండల కన్వీనర్ సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. నాయకులు భోజన్న, పోతారెడ్డి ఉన్నారు.
- లక్ష్మణచాంద మండలంలోని చింతల్‌చాంద, చామన్‌పెల్లి, మునిపెల్లి గ్రామాల్లో నీట మునిగిన పంటలను రైతులతో కలిసి డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పరిశీలించారు. మండలంలో జరిగిన పంట నష్టంపై వ్యవసాయ అధికారి వసంతరావుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. రైతులకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఇటీవల మునిపెల్లి గోదావరి కుర్రులో చిక్కుకుని క్షేమంగా బయటపడ్డ పార్‌పెల్లి తండాకు చెందిన శంకర్ నాయక్ ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ కమిటీ చైర్మన్లు భీంరెడ్డి, అబ్దుల్ హాధి, ఆత్మ చైర్మన్ రాంరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్ ఉన్నారు. చింతల్‌చాంద, చామన్‌పెల్లి, మునిపెల్లి గ్రామాల్లో మునిగిన పంటలను సీపీఎం రాష్ట్ర నాయకుడు రవీందర్ పరిశీలించారు. చింతల్‌చాందలో మునిగిన ప్రాంతాలను సీపీఐ ఎంఎల్‌మాస్ లైన్ జిల్లా నాయకుడు ఎస్.గంగన్న పరిశీలించారు.
- కడెం మండలం లింగాపూర్ శివారులో నీటమునిగిన పంటలను తహసీల్దార్ ఆర్.ప్రభాకర్ పరిశీలించారు. ఆర్ఐ శారద, గ్రామస్తులు ఉన్నారు.
- సోన్ మండలంలో నీట మునిగిన పంటలను మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పరిశీలించారు. మండల కేంద్రం తోపాటు కూచన్‌పల్లి, జాఫ్రాపూర్, పాక్‌పట్ల, మాదాపూర్ గ్రామాల్లో నీటమునిగిన పంటలను సీపీఎం జిల్లా అధ్యక్షుడు రవీందర్, నాయకులతో కలిసి పరిశీలించారు. దాదాపు 3 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతినగా, వరి, పసుపు, మొక్కజొన్న, సోయాబీన్ పంటలు నీటమునిగాయన్నారు.

అర్ధరాత్రి అక్కడే అధికారులు



చిన్నబెల్లాల్ గ్రామ శివారులో అధికారులు

కడెం: గోదావరి వరద ప్రవాహం శుక్రవారం రాత్రి అంతకంతకు పెరగడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. రాత్రి 12 దాటిన తర్వాత ఎంపీడీవో అరుణ, ఎంపీవో కవిరాజు, ఆర్ఐ శారద, పంచాయతీ కార్యదర్శి భూమేశ్‌లు మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామానికి వెళ్లి గోదావరి వరదను పరిశీలించారు. గ్రామస్తులను ఆలర్ట్ చేశారు

- నిర్మల్‌రూరల్ మండలం మంజులాపూర్, వెంగవాపేట, ముజిగి, తంస, కొట్లకే గ్రామాల్లో ఏవో వసంత్ ఆధ్వర్యంలో క్షేత్ర పర్యటన చేసి పంట నష్టంపై అంచనా వేశారు. వరి 230 ఎకరాలు, పత్తి 55 ఎకరాలు, సోయాబీన్ 20 ఎకరాలు, మొక్కజొన్న 28 ఎకరాలు నష్టపోయినట్లుగా తేల్చారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపించామన్నారు. ఏఈఓ అంబాజీ, ఆత్మ డైరెక్టర్ రవి ఉన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

ఖానాపూర్: తర్లపాడ్‌లో పేదలకు ప్రభుత్వం ఇళ్ల పట్టాలివ్వాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఉడుత రవీందర్ అన్నారు. మండలంలోని తర్లపాడ్ గ్రామాన్ని శనివారం సందర్శించి ఇటీవల వర్షాల కారణంగా నిరాశ్రయులైన బాధిత పేదలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. గౌతం కృష్ణ, నూతన్‌కుమార్, ఫసీఉద్దీన్, శంభు, నర్సయ్య, తిరుపతి ఉన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

దస్తురాబాద్: ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా ఇన్‌చార్జి ఉడుత రవీందర్ కోరారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని బుట్టాపూర్‌లోని ఇళ్లలోకి వరద నీరు చేరడంతో 20 కుటుంబాలు ఇబ్బంది పడ్డాయి. శనివారం వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, నాయకులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

గణేశ్ నిమజ్జనం షురూ

ఖానాపూర్: పట్టణంలోని ఆర్‌జీవీ పాఠశాల విద్యార్థులతో శనివారం గణేశ్ శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం విగ్రహ ప్రతిమను స్థానిక గోదావరి తీరం సమీపంలో నిమజ్జనం చేశారు. సీఐ అజయ్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు సురేశ్, పాఠశాల డైరెక్టర్ రాకేశ్ ఉన్నారు.

పౌరహక్కుల దినోత్సవం

సారంగపూర్/కుంటాల: సారంగపూర్ మండలంలోని తాండ్ర(జి)లో శనివారం ఎంఆర్ఐ నర్సయ్య, ఎంపీవో అజీజ్‌ఖాన్ ఆధ్వర్యంలో, కుంటాల మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ కమల్‌సింగ్, ఆర్ఐ రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి రాజబాపు, గ్రామస్తులు ఉన్నారు.

నూతన కార్యవర్గం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని మసీదు నూతన కమిటీ కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. సదర్‌గా మజారుద్దీన్, నయాబ్ సదర్‌గా మొయినొద్దీన్, జనరల్ సెక్రెటరీగా సలావుద్దీన్, కోశాధికారిగా ఏజాజ్, సభ్యులుగా సాజిద్, అబ్దుల్ వాహెద్, శుకుర్ పాషా, సయ్యద్ జమీల్షా, మొయినొద్దీన్, రిజ్వాన్, ఫైసల్ ఎన్నికయ్యారు.

సన్మానం

సోన్: సిద్దులకుంట ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు టి.నరేందర్ ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా తోటి టీచర్లు, పీఆర్టీయూ సభ్యులు శనివారం సన్మానించారు. దంపతులను పూలమాలతో సత్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారావు, హెచ్ఎం హరీశ్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా అన్నభావుసాఠే జయంతి

కుభీర్: కుభీర్‌లో సాహితీ సామ్రాట్ అన్నాబావుసాఠే జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్ నుంచి బాజాభజంత్రీలతో ఊరేగింపుగా వచ్చి బస్టాండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేశారు. మార్కెట్ చైర్మన్ కళ్యాణ్, మాజీ సర్పంచ్ జి.బాబు, ఆత్మ చైర్మన్ వివేక్, నాయకులు సాయినాథ్, అనిల్, పిరాజి, విజయ్ ఉన్నారు.

పీచరలో వైద్యశిబిరం

లక్ష్మణచాంద: పీచరలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరపీడితులకు వైద్యసిబ్బంది మందులు అందజేశారు.